# కార్యేషు దాసి...

"నీ దృష్టిలో ఎవరైనా ఓ మంచి అమ్మాయుంటే చెప్పవోయ్. చాలా అర్జెంట్" అన్నాడు నా చిన్నప్పటి స్నేహితుడు ధర్మారావు, కారు దిగి మా ఇంట్లో కొస్తూనే.

"చాలా రోజుల తర్వాత కలిశావ్. మొదలైతే ఇలా కూర్చో. కాస్త స్థిమితపడు. తర్వాత మాట్లాడుకుందాం"! అన్నాను, అతన్ని మా డ్రాయింగ్ రూమ్‌లోకి తీసికెళ్ళి సోఫాలో కూర్చోబెడుతూ.

"నీతో ఇదివరకటిలా స్తిమితంగా కూర్చొని గంటలకు గంటలు మాట్లాడే అవకాశం లేదు. చాలా అర్జెంట్. ఓ మంచి అమ్మాయి కావాలి. నీ దృష్టిలో ఎవరన్నా ఉంటే చెప్పు" అన్నాడు ధర్మారావు.

"ఎందుకు?" అన్నాను కొంచెం అమాయకత్వం నటిస్తూ.

"ఎందుకేమిటి? మా అబ్బాయి గౌతమ్ రెండ్రోజుల్లో ఇండియా వస్తున్నాడు. వాడికీసారి పెండ్లి చేసి పంపించాలనుకుంటున్నాను."

"అదా సంగతి! చాలా సంతోషం. మీ గౌతమ్‌కు ఇప్పటికైనా, అదీ ఓ ఇండియా అమ్మాయితో పెండ్లి చెయ్యాలని నిర్ణయించుకున్నందుకు... ప్రస్తుతమైతే నాకెవరూ గుర్తురావడంలేదు. పైగా చాలా అర్జెంటంటున్నావు. ఇప్పటికిప్పుడో అమ్మాయి కావాలంటే ఎలా దొరుకుతుంది? అదేమన్నా బజార్లో అమ్మబడే సరుకా?"

"నువ్వో పెద్ద రచయితవు కదా, నీకు ఆంధ్రదేశమంతా పరిచయస్థులున్నారు గదా, వాళ్ళో వీళ్ళో నీతో మాకో అమ్మాయుంది. ఓ అబ్బాయిని చూడండని చెబుతుంటారు కదా. అందుకని నిన్నడుగుతున్నాను. నువ్వు ఇదివరకోసారి నీకు సాహిత్యం ద్వారా పరిచయమైన నీ ఫ్రెండ్ కూతురి పెళ్ళి కుదిరించినట్టు నాకు గుర్తుంది. అట్లాగే మా వాడిక్కూడా ఎవరినైనా కుదిరిస్తావేమోనని ఇలా వచ్చాను."

"అవునవును. మా ఫ్రెండ్ కూతురికి ఈ మధ్యనే పెళ్ళయింది. ఆ సంబంధం నేను కుదిరించిందే. అదీ అనుకోకుండా జరిగింది. అది కులాంతర వివాహం. స్టేజి మ్యారేజ్ అంటారు చూడు, అలాంటిది. స్టేజీ మీద వధూవరుల చేత ప్రమాణాలు చేయించడం, దండలు మార్పించడం- ఆ పనులన్నీ నేనే చేయించాను. అంటే, ఆ పెళ్ళికి నేనే పురోహితునిగా వ్యవహరించానన్నమాట" అన్నాను కొంచెం గర్వంగా.

"నాకంతా తెలుసులేవోయ్. మాక్కూడా మా కులపు అమ్మాయే కావాలన్న పట్టింపేమీ లేదు. కాకపోతే పారలల్‌కేస్ట్ అయితే బెటర్. స్టేజి మ్యారేజికి మాత్రం నేను వ్యతిరేకిని. పెండ్లి మన హిందూ సంప్రదాయం ప్రకారం జరగాల్సిందే. మా గౌతమ్ అమెరికాలో ఉంటున్నప్పటికీ, వాడికి మన సంప్రదాయాలంటే చాలా గౌరవం. రెండురోజుల్లో వాడు ఇండియాలో దిగుతున్నాడు. రెండు వారాలుంటాడు. రెండు వారాల్లోనే పెళ్ళయిపోవాలంటున్నాడు. నీకు తెలుసు కదా, మావాడు శాన్‌ఫ్రాన్సిస్కోలో ఓ పెద్ద మల్టీ నేషనల్ కార్పొరేషన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. నెలకు వాడికి ఇరవైవేల డాలర్ల జీతం. అది ఇండియన్ కరెన్సీలో ఎంతవుతుందో నువ్వే కాలిక్యులేట్ చేసుకో. మేం మా కేస్ట్‌లో కొందరమ్మాయిల్ని చూశాం గానీ ఎవరూ మా అంచనాలకు దగ్గరగా లేరు" అన్నాడు ధర్మారావు.

"ఎందుకైనా మంచిది. మీ అంచనాలేమిటో కాస్త చెబుతావా?"

మా వాడు చాలా ఎత్తుంటాడు కదా. హీ ఈజ్ ఎ సిక్స్ ఫుటర్ కదా. చాలా అందంగా కూడా ఉంటాడు కదా. హీ ఈజ్ ఎ వెరీ హీండ్సమ్ గై యూనో. అందుకని అమ్మాయి కూడా వాడికి తగ్గ స్థాయిలో ఉండాలి. కనీసం అయిదున్నర అడుగుల ఎత్తన్నా ఉండాలి. తెల్లగా, సన్నగా, సాఫిస్టికేటెడ్‌గా ఉండాలి. కనీసం డిగ్రీ అయినా చేసి ఉండాలి. ఆమె అక్కడికొచ్చి జాబ్ చెయ్యాలన్న కండిషన్ ఏమీ లేదు. మావాడు బోల్డు సంపాదిస్తున్నాడు. అది చాలు. హౌజ్‌వైఫ్‌గా ఉంటూ ఇంటిని చక్కబెట్టుకుంటే చాలు. అలసిపోయి ఇంటికొచ్చిన భర్తకు చెయ్యాల్సిన సపర్యలన్నీ చేస్తూ ఉంటే ఇద్దరూ హాయిగా ఉండొచ్చు."

"డిగ్రీ చేస్తే చాలన్నావు. ఏ డిగ్రీ అయినా ఫరవాలేదా?

"ఏ డిగ్రీ అయినా ఫరవాలేదు ఇంగ్లీషు ఫ్లూయెంట్‌గా మాట్లాడగలిగితే చాలు."

"అయితే, ఓ సంబంధం ఉంది. నాకిప్పుడు గుర్తొచ్చింది. మా దగ్గరి బంధువులమ్మాయే. మీ అంచనాలకు సరిపోయే ఓ అమ్మాయుంది" అన్నాను. నేను, మా తమ్ముడు జనార్దన్ వాళ్ళమ్మాయి సారికను గుర్తుచేసుకొని.

"అయితే ఇంకే. మావాడు రాగానే పెళ్ళిచూపులేర్పాటు చెయ్యి. నువ్వు నాకో పెద్ద సమస్యను తీర్చినవాడివౌతావు."

"నేను మొదలు ఆ అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడాలి. వాళ్ళు ఒప్పుకుంటే పెళ్ళిచూపులెంతసేపు. వెంటనే ఏర్పాటు చెయ్యొచ్చు. వాళ్ళిక్కడే, మన హైదరాబాద్‌లోనే ఉంటున్నారు" అన్నాను.

"ఓ.కె, ఓ.కె. అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడి నాకు వెంటనే ఫోన్ చెయ్యి. నేను వెళ్తా మరి" అంటూనే ధర్మారావు సోఫామీంచి లేచి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాడు.

అతనితో పాటు గేటు దాకా నడిచి, అతను కారెక్కేదాకా ఉండి, కారు కదిలాక నేను మా ఇంట్లోకొచ్చాను.

ధర్మారావుది, నాది ఒకటే ఊరు. హైస్కూలు దాకా కలిసే చదువుకున్నాం. తర్వాత అతడు పాలిటెక్నిక్ కాలేజీలో జాయిన్నై, సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేశాడు. కొద్దికాలం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసి, తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి, కాంట్రాక్టర్‌గా మారి, లక్షలకు లక్షలు డబ్బు సంపాదించాడు. అతనికి ఇద్దరూ కొడుకులే. కూతుళ్ళు లేరు. ఇద్దర్నీ ఇంజనీరింగ్ చదివించి అమెరికాకు పంపించాడు. ఇప్పుడు పెండ్లి చేసుకోబోతున్న గౌతమ్ పెద్దవాడు.

"డిగ్రీ చేసిన అమ్మాయైనా చాలు" అని ధర్మారావు అన్నప్పుడే నాకు మా సారిక గుర్తొచ్చింది.

సారిక మా చిన్నమ్మ కొడుకు- అంటే మా అమ్మ చెల్లెలి కొడుకు- అంటే, మా తమ్ముడు జనార్దన్ కూతురు. సారిక ఇక్కడే హైదరాబాద్‌లోని హోమ్‌సైన్స్ కాలేజీలో చదివి, ఫుడ్ సైన్స్‌లో డిగ్రీ తీసుకుంది. సారిక చూడటానికి చాలా అందంగా ఉంటుంది. ధర్మారావు సూచించిన లక్షణాలన్నీ ఆమెలో ఉన్నాయి. మా తమ్ముడు జనార్దన్ ఇక్కడే హైదరాబాద్‌లోని ఓ డిగ్రీ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మధ్య వాడు నాతో చాలా సార్లు "మన సారిక్కేదైనా మంచి సంబంధం ఉంటే చూడన్నయ్యా", అని చెప్పాడు!

జనార్దన్‌కు ముగ్గురూ కూతుళ్ళే. ముగ్గురమ్మాయిల పెళ్ళిళ్ళు ఎలా చెయ్యాలా అని వాడు చాలా బాధపడిపోతుండటం నేను చూశాను. ఈ సంబంధం సారికకు చాలా బావుంటుందనిపించింది. ఇదే విషయం మా ఆవిడతో చర్చించాను.

"అన్నీ బాగానే ఉన్నాయి గానీ, మీ ధర్మారావుతో కట్నం కానుకల విషయం తేల్చుకోలేదేమిటి? అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు ఇరవై వేల డాలర్లు సంపాదిస్తున్నాడంటే వాళ్ళు ఎంత కట్నం అడుగుతారో ఆలోచించారా? అంత కట్నం మీ తమ్ముడు జనార్ధన్ ఇవ్వగలుగుతాడా" అంది మా ఆవిడ.

"నువ్వన్నది కూడా నిజమే. నాకు కట్నం కానుకల విషయం గుర్తే రాలేదు. అయినా ఫోన్ చేసి అడుగుదాం, ఎంత ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారని" అన్నాన్నేను.

నేను వెంటనే జనార్ధన్‌కు ఫోన్ చేసి విషయం చెప్పి, ఓసారి సారికను తీసుకొని మా ఇంటికి రమ్మని చెప్పాను.

"ఈ సంబంధం నాకిష్టమే అన్నయ్యా" అన్నాడు జనార్ధన్.

"నీ సంగతేమిటి సారికా?" అన్నాను.

"ఇష్టమని గానీ, అయిష్టమని గానీ నేనిప్పుడే చెప్పను. ఓసారా అబ్బాయిని చూడటానికీ, అతనితో మాట్లాడటానికీ అభ్యంతరమైతే లేదు" అందు సారిక.

"ఇష్టాయిష్టాలు తర్వాత గానీ, మొదలైతే వాళ్ళకు ఫోన్ చేసి కట్నం కానుకల విషయం కనుక్కోండి" అంది మా ఆవిడ.

నేను ధర్మారావుకు ఫోన్ చేశాను.

వాళ్ళబ్బాయి గౌతమ్ ఇవాళ ఉదయం ఫ్లైట్‌లోనే హైదరాబాద్‌లో దిగాడని చెప్పాడు.

"కట్నం కానుకలు ఏమాత్రం ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా"రని అడిగితే, "అది పెద్ద సమస్య కానే కాదు" అన్నాడు

"వాళ్ళ శక్తిమేరకు ఎంతిచ్చినా తీసుకుంటా"మన్నాడు. "పెండ్లి మాత్రం ఇక్కడ హైదరాబాద్‌లోనే చాలా గ్రాండ్‌గా చెయ్యా"లన్నాడు.

"ఈ విషయాలన్నీ పెండ్లికూతురు తండ్రితో మాట్లాడి మీకు మళ్ళీ ఫోన్ చేస్తా"నని ధర్మారావుకు చెప్పాను.

ధర్మారావు పెట్టిన కండిషన్స్‌కన్నింటికీ జనార్ధన్ ఒప్పుకున్నాడు.

మూడు రోజుల తర్వాత మా ఇంట్లోనే పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాం.

గౌతమ్, ధర్మారావు, ధర్మారావు భార్య సుమతీ, సుమతి చెల్లెలు సుగుణ, ఆమె భర్త ఆనంద్- పెళ్ళికొడుకు తరపున వచ్చారు.

జనార్ధన్, జనార్ధన్ భార్య సరళ, సారిక, సారిక ఫ్రెండ్ ప్రీతి- వీళ్ళు పెళ్ళికూతురు తరపున వచ్చారు.

గౌతమ్ నన్ను చూడగానే "హాయ్, అంకుల్"! అన్నాడు.

"హాయ్, గౌతమ్"! అన్నాను నేను.

సారిక తప్ప అందరం మా డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాము.

"నువ్వు అమెరికాకు వెళ్ళి ఎంతకాలమైంది గౌతమ్?" అడిగాను.

"సెవెన్ ఇయర్స్ అయిందంకుల్"! అన్నాడు గౌతమ్.

"మా వాడు గ్రీన్ కార్డ్ హోల్డర్"! అన్నాడు ధర్మారావు.

"నాకో సందేహం గౌతమ్... మీలాంటి యంగ్ అండ్ డైనమిక్ పీపులంతా ఇక్కడి కాలేజీల్లో చదివి, ఇంజనీరింగ్ డిగ్రీలు తీసుకొని, అమెరికాకు వెళ్ళిపోయి, అక్కడే సెటిలైపోతున్నారు. వెళ్ళేటప్పుడు మాత్రం అక్కడో అయిదారేళ్ళు మాత్రమే ఉండి మళ్ళీ ఇండియాకొస్తామంటారు

కానీ, ఎవరూ రారు. అక్కడి లైఫ్, అక్కడి వాతావరణం, అక్కడి వర్క్ కల్చర్, అక్కడి ప్రజల ఆనెస్టీ- అన్నీ చాలా బావుంటాయంటారు. వాళ్ళ స్థాయిని అందుకోవడానికి మన ఇండియన్స్‌కు మరో వంద సంవత్సరాలైనా పడుతుందంటారు. అలాంటప్పుడు మీరు అమెరికా అమ్మాయిలనే ఎందుకు పెళ్ళి చేసుకోరూ? ఇండియా అమ్మాయే కావాలని ఇక్కడికి పరిగెత్తుకొస్తారెందుకని? అక్కడ సెటిలైన ఇండియన్స్ కూడా ఎందరో ఉన్నారు కదా? కనీసం వాళ్ళ పిల్లల్నైనా చేసుకోరెందుకు?" అన్నాను నేను గౌతమ్‌నుద్దేశించి.

"చాలా మంచి ప్రశ్న అడిగారంకుల్! మీ ప్రశ్నకు నేను ఒక్క మాటలో సమాధానం చెప్పాలంటే.... ఇండియన్ గర్ల్స్ ఆర్ జనరల్లీ గుడ్. అమెరికన్స్ చాలా ఫీల్డ్స్‌లో గొప్ప ఎచీవ్‌మెంట్స్‌నే సాధించారు గానీ, అక్కడ ఫ్యామిలీ లైఫ్ అనేది లేదంకుల్. ఫ్యామిలీస్ అక్కడ అంతరించిపోతున్నాయి. ఇట్స్ పరిమిసివ్ సొసైటి! ఫ్యామిలీ మెంబర్స్‌ది, ఎవరి దారి వారిదే- ముఖ్యంగా గర్ల్స్ చాలా అన్‌రూలీగా, అగ్రెసివ్‌గా, ఇన్‌డిసిప్లిన్డ్‌గా తయారయ్యారు. వాళ్ళల్లో స్త్రీలలో ఉండే సెన్సిటివిటీయే పోయింది. ప్రీ మారిటల్ సెక్స్ అక్కడ కామన్! నోబడీ టేక్సిట్ సీరియస్‌లీ. ఇక్కడ అట్లా కాదు. ఇక్కడి గర్ల్స్, ముఖ్యంగా మన మిడిల్ క్లాస్ గర్ల్స్ అలా చెడిపోలేదు. అందుకే మేం మీరన్నట్లు పెళ్ళికూతుళ్ళ కోసం ఇండియాకు పరిగెత్తుకొస్తున్నాం. నేను చాలా కాలంగా అమెరికాలో ఉంటున్నప్పటికీ, భారతీయ సంప్రదాయాలంటే నాకు చాలా ఇష్టం. నా దృష్టిలో భార్యంటే మన పూర్వులు చెప్పినట్లుగా కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయనేషు రంభలా ఉండాలి. దట్స్ ఏన్ అయిడియల్ వైఫ్. ఇండియన్ గర్ల్స్ అయితేనే అలాంటి భార్యలు కాగలుగుతారని నా నమ్మకం" అన్నాడు గౌతమ్.

"కానీ, ఇండియన్ మిడిల్ క్లాస్ గర్ల్స్‌లో కూడా ఇప్పుడు చాలా మార్పులొస్తున్నాయి. ఈ గ్లోబలైజేషన్ పుణ్యమా అని మీ అమెరికా ప్రభావం ఇక్కడి వాళ్ళ మీద కూడా బాగానే పడుతున్నది" అన్నాన్నేను.

"ఇక్కడి గర్ల్స్‌లో కూడా మార్పులొస్తుండొచ్చు. బట్ దే ఆర్ ఓన్లీ మార్జినల్ చేంజెస్. అవి పెద్ద మార్పులని నేననుకోను. బేసికల్లీ, అవర్ హిందూ సొసైటీ ఈజ్ ఎ కన్సర్వేటివ్ సొసైటీ"! అన్నాడు గౌతమ్.

అతనితో వాదనను పెంచడం ఇష్టం లేక నేను మెదలకుండా ఊరుకున్నాను.

ఈలోగా పెళ్ళిచూపులకంతా సిద్ధమైంది.

స్వీట్స్, కారా, టీ మొదలైన సరంజామా పట్టుకొని సారిక వచ్చేసింది. పెద్దగా అలంకరించుకోకుండా చాలా సింపుల్‌గా, సహజంగా కనిపించిందా అమ్మాయి.

అందరూ టీ సేవించడం అయిపోయాక గౌతమ్, సారిక వేరే రూమ్‌లోకెళ్ళి ఓ అరగంట సేపు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత "నాకీ అమ్మాయి నచ్చిం"దని గౌతమ్. "నాకీ అబ్బాయి నచ్చా"డని సారిక చెప్పేశారు.

పదిరోజుల్లోనే వాళ్ళ పెళ్ళి ధర్మారావు కోరుకున్నట్టుగానే చాలా గ్రాండ్‌గా జరిగింది. కొన్ని వేలమంది అతిథులొచ్చారు. అయిదు వేల మంది అతిథులు కూర్చోవడానికి వీలుగా, అత్యంత సుందరంగా నిర్మించబడిన ఎయిర్ కండిషన్డ్ మ్యారేజ్ హాల్లో వాళ్ళ పెళ్ళి జరిగింది. కల్యాణ మండపాన్ని బెంగుళూరు నుండీ తెప్పించిన రకరకాల పుష్పాలతో కళ్ళు జిగేల్‌మనేలా అలంకరించారు. ఓ ఫైవ్ స్టార్ హోటల్ వాళ్ళకు కేటరింగ్ అప్పగించారు. వెజిటేరియన్ అండ్ నాన్ వెజిటేరియన్ ఫుడ్ సర్వ్ చేశారు. పెళ్ళికొచ్చిన అతిథులందరికీ వెండి కుంకుమ భరిణల్ని కానుకగా అందించారు. పెళ్ళి కూతురు తండ్రి జనార్దన్‌కు పెళ్ళి ఖర్చే మూడు

లక్షలు దాటింది. పెళ్ళికి వచ్చిన ముఖ్య అతిథులందరూ ఇంత వైభవంగా జరిగిన పెళ్ళిని మేమీ మధ్య చూళ్ళేదన్నారు.

"పెండ్లి నేను కోరుకున్నదాని కంటే గ్రాండ్‌గా చేశారు బావగారూ" అంటూ ధర్మారావు జనార్దన్‌ను గట్టిగా కౌగిలించుకున్నాడు. "అంతా మీ దయ బావగారూ" అన్నాడు జనార్దన్.

వియ్యంకులిద్దరూ అంత ఆత్మీయంగా కలిసిపోవడంతో పెళ్లి కొచ్చిన బంధువులందరూ చాలా సంతోషించారు. ఈ పెళ్ళి ద్వారా ఇంత మందిని, ఇంత ఆత్మీయులుగా మార్చగలిగినందుకు నేను కూడా చాలా సంతోషించాను.

పెండ్లయిన తర్వాత గౌతమ్, సారికలు అమెరికాకు వెళ్ళిపోయారు. బంధువులంతా విమానాశ్రయం దాకా వెళ్ళి వాళ్ళను సాగనంపారు.

పెద్ద బరువు తీరిపోయిందని జనార్దన్ సంతోషించాడు. చాలా మంచి సంబంధాన్ని చూపించావనీ, నీ వల్లనే ఈ పెళ్ళి కుదిరిందనీ ధర్మారావు నాకు థ్యాంక్స్ చెప్పాడు.

సరిగ్గా నెల రోజుల తర్వాత నేనో పిడుగులాంటి వార్త విన్నాను. సారిక భర్తనొదిలేసి అమెరికానుండొచ్చేసిందట. "ఎందుకు?" అని అడిగితే జనార్దన్ ఏ కారణమూ చెప్పలేదు.

ధర్మారావు ఫోన్ చేసి మరో పిడుగులాంటి వార్త చెప్పాడు. "నా మీదా, నా భార్య మీదా మీ తమ్ముడు జనార్దన్ అరెస్ట్ వారెంట్స్ ఇష్యూ చేయించాడు. మేం ఆయన్నూ, ఆయన అమ్మాయినీ కట్నం కావాలని వేధించామట! ఏ క్షణంలోనైనా పోలీసులు మమ్మల్ని అరెస్ట్ చెయ్యడానికి రావొచ్చని మేం ఎక్కడెక్కడో దాక్కుంటున్నాం. ఆంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నాం. ఎంతఅన్యాయం? ఎంత దారుణం! మేం కట్నం కావాలని ఎప్పుడైనా అడిగామా చెప్పండి? మొత్తమ్మీద మీరు భలే సంబంధం చూపించార్లెండి"! అన్నాడు. ఎందుకిలా జరిగిందని నేను అడుగుతున్నా, నా మాట వినిపించుకోకుండా ఆయన ఫోన్ పెట్టేశాడు.

నేను తీరికగా వెళ్ళి జనార్దన్‌నూ, సారికనూ కలిశాను. "ఎందుకిలా జరిగిం"దంటే వాళ్ళు బిక్క మొహాలేసుకొని మౌనంగా చూడటమే తప్ప సమాధానం చెప్పలేదు.

"అసలేం జరిగిం"దని జనార్దన్‌ను అడిగితే, "దాన్నే అడుగు" అన్నాడు జనార్దన్ సారికను చూపిస్తూ.

"ఏం జరిగిందో చెప్పు సారికా?" అని ఎన్నో సార్లు అడిగాక సారిక నోరు విప్పింది. "వాడో బ్రూట్ పెదనాన్నా! భార్యంటే వాడి దృష్టిలో ఓ పనిమనిషి మాత్రమే. స్త్రీని గౌరవించడం అనే కాన్‌సెప్ట్ వాడికి లేనేలేదు. దేనికైనా ఓ హద్దుంటుంది. వాడా హద్దు దాటాడు. మొదట్లో కొద్ది రోజుల తర్వాత మారతాడేమోననుకున్నాను. అనేక రకాలుగా చెప్పి చూశాను. పదే పదే నువ్వింత అగ్రెసివ్‌గా బిహేవ్ చేస్తావని కలలో కూడా అనుకోలేదంటాడు. చాలా డొసైల్‌గా, సబ్మిసివ్‌గా ఉంటావనుకున్నానంటాడు. బాగా తంతే తప్ప నీకు బుద్ధి రాదని చాలా సార్లు చెయ్యి చేసుకున్నాడు. నేను ఎదురు తిరిగితే ఇంకా రెచ్చిపోయి నన్ను హింసించడం ఎక్కువ చేశాడు. ఇక ఈ శాడిస్టును భరించలేనని నిర్ణయించుకొని, ఓ ఫ్రెండ్ సహాయంతో ఇండియా వచ్చేశాను. మీరు మీ రచనల్లో ఎన్నో చోట్ల స్త్రీ ఎట్టి పరిస్థితుల్లో కూడా తన ఆత్మగౌరవాన్ని పోగొట్టుకోవద్దని రాశారు. సరిగ్గా నేను నా ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసమే వాడిని, వాడి దేశాన్ని వదిలేసి వచ్చేశాను. నేను చేసింది తప్పంటారా పెదనాన్నా?" అంది సారిక.

ఆమెకేం సమాధానం చెప్పాలో నాకర్థం కాలేదు.

కానీ, సారిక మాటలు విన్నాక ఆమె గౌతమ్‌ని ఎందుకు వదిలేసి వచ్చిందో నాకర్థమైంది.

(ఇండియాటుడే, 1-7-2003)